క్లుప్తంగా

హోలీ సంబరాలు

కోడుమూరు రూరల్: మండలంలో హోలీ వేడుకలను బుధవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. హోలీ సందర్భంగా పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఉదయాన్నే మంటలు వేసి కామదహనం చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు, పెద్దలు రంగు నీళ్లను ఒకరిపై ఒకరు చల్లుకుంటూ హోలీ సంబరాల్లో మునిగి పోయారు. కోడుమూరులో ఏ వీధిలో చూసినా రంగునీళ్లను చల్లుకుంటున్న చిన్నారులు, పెద్దలే కన్పించారు.

మహిళా హక్కులను పోరాడి సాధించుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ బ్రహ్మారెడ్డి

కర్నూలు: మహిళా హక్కులను పోరాడి సాధించుకోవాలని జేవీవీ వ్యవస్థాపకులు బ్రహ్మారెడ్డి పిలుపునిచ్చారు. జనవిజ్ఞాన వేదిక మహిళా విభాగం ఆధ్వర్యంలో సమత రాష్ట్ర నాయకురాలు సుజాత అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం స్థానిక కేవీఆర్ కాలేజీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆడపిల్లలు ధైర్యంగా జీవించాలని ఉదాహరణలతో వివరిస్తూ ముఖ్యంగా స్త్రీలు మూఢ నమ్మకాలను వీడాలన్నారు. జేవీవీ జాతీయ నాయకులు మహమ్మద్ మియా పాట, మాటతో సందేశం అందించారు. జేవీవీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దామోదర్, ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి విజేతలైన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. సమత సభ్యులు నిర్వహించిన కార్యక్రమాల్లో గెలుపొందిన మహిళలకు రాష్ట్ర నాయకులు శేషాద్రి రెడ్డి, మన్సూర్ బాషా బహుమతులు అందజేశారు. జేవీవీ రాష్ట్ర నాయకులు యోహాన్ మ్యాజిక్ ప్రదర్శించారు. కార్యక్రమంలో జేవీవీ మహిళా విభాగం జిల్లా నాయకులు హరిత, తేజోమయి, శివనాగిరెడ్డి, చెన్నకేశవరెడ్డి, రామలక్ష్మయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో సగభాగం మహిళలు



కోలాటం ఆడుతున్న మహిళలు

కర్నూలు(అర్బన్): సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలకు ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ జ్యోతిర్మయి అన్నారు. బుధవారం రాత్రి స్థానిక టీజీవి కళాక్షేత్రంలో రాయలసీమ మహిళా సమాఖ్య ఆవిర్భావ దినోత్సవం, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధానంగా మహిళల ఆటపాటలు, పొడుపు కథలు, కోలాటం, చెక్క భజన వంటి సాంస్కృతిక కార్య క్ర మాలు ఆకట్టుకున్నాయి.ఈ నేపథ్యంలోనే వివి ధ రంగాల్లో విశిష్ట సేవలందించిన మహిళలను సత్కరించారు. సన్మానం అందుకున్న వారిలో స్వర్ణలత, శశికళ, బాశెట్టి లత, జయలక్ష్మీ, భా గ్యలక్ష్మి పసుపులేటి నీలిమ, విజయలక్ష్మి, సాయిముద్రిక,ఉమాదేవి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో రాయలసీమ మహిళా సమాఖ్య నాయకురాళ్లు సుజాత, భారతి, సుధ, వసుంధ ర, బ్రాహ్మణి, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి కృషి



కేక్ కట్ చేస్తున్న ఎస్‌బీఐ డీజీఎం లేఖా మీనన్

కర్నూలు(అగ్రికల్చర్): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తోందని కర్నూలు డిప్యూటీ జనరల్ మేనేజర్ లేఖా మీనన్ తెలిపారు. బుధవారం వెంకటరమణ కాలనీలోని ఎస్‌బీఐ బిజినెస్ కార్యాలయంలో మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. డీజీఎం మాట్లాడుతూ... మహిళల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఎస్‌బీఐ అమ లు చేస్తున్న పథకాలను వివరించారు. బిజినెస్ కార్యాలయంలో పనిచేసే ఉ ద్యోగులు, నగరంలోని వివిధ బ్రాంచీల మేనేజర్‌లు, డిప్యూటీ మేనేజర్లు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

కర్నూలు(రాజ్‌విహార్): మహిళలు అన్ని రంగాల్లో రా ణించాలని ప్రజా రవాణ శాఖ జిల్లాధికారి వెంకటరా మం అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక కొత్త బస్టాండ్ ఆవరణలో కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు పురుషులతో పోటీపడి విద్య, ఉద్యోగ, స్వయం ఉపాధి, రాజకీయ ఎలా ఏ రంగంలోనైనా మెరుస్తున్నారని చెప్పారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన కండక్టర్లు, మహిళ ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాది జ్యోతి పాల్గొన్నారు.

సుంకేసులకు 810 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి బుధవారం 810 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. డ్యాంలో ప్రస్తుతం 0.782 టీఎంసీల నీటి నిల్వ ఉండగా కేసీ కాల్వకు 935 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

● నియోజకవర్గంలో 17,262 మంది పట్టభద్రులు, 1710 మంది ఉపాధ్యాయ ఓటర్లు

పాణ్యం: ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 13న పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు కేంద్రాల ఏర్పాటు, సిబ్బంది నియామకం, పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బంది లేకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ, స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికలకు పోటీ జరగనుంది. దీంతో పోటీ చేసే వారి సంఖ్య కూడా భారీగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇక ఓటర్ల జాబితా ఆయా రెవెన్యూ కార్యాలయాలకు చేరడంతో అధికారులు ఓటరు స్లిప్‌లను పంపిణీ చేసే పనిలో పడ్డారు. ఈ స్లిప్‌ల పంపిణీ దాదాపు పూర్తి కావొచ్చిందని చెబుతున్నారు. ఇక పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల నియమావళి 30 యాక్ట్ ప్రకారం 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. అలాగే పోలింగ్ కేంద్రాల్లో పీఓ, ఏపీఓ ఓపీఓలు ఇద్దరు చొప్పున అధికారులను నియమించనున్నారు.



పాణ్యం ఉర్దూ పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఓటరు స్లిప్‌తో పాటు ఐడీ కార్డు తప్పనిసరి

ఈనెల 13న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఉన్నందున ఓటు వేసేందుకు వచ్చేవారు ఓటరు స్లిప్‌తో పాటు తప్పకుండా ఆధార్, రేషన్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్‌లో ఏదో ఒక గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలి. పోలింగ్ సమయం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుంది. 4 గంటల్లోపు పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతిస్తాం. బ్యాలెట్ జాబితాలో అభ్యర్థుల ఫొటో, పేరు మాత్రమే ఉంటుంది. ఓటర్లు తమకు నచ్చిన అభ్యర్థులకు ప్రాధాన్యత ప్రకారం ఓటు వేయవచ్చు. అభ్యర్థి పేరుకు ఎదురుగా ప్రాధ్యాన్యత నంబర్ రాయల్సి ఉంటుంది. ఓటర్లకు స్లిప్‌ల పంపిణీ పూర్తిచేశాం. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. – రామసుబ్బారెడ్డి, ఎన్నికల అధికారి

పాణ్యం నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు

మండలం	పట్టభద్రులు	ఉపాధ్యాయులు	పోలింగ్ కేంద్రాలు
పాణ్యం	1,066	75	ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాణ్యం
గడివేముల	962	43	ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గడివేముల
ఓర్వకల్లు	1,214	70	ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఓర్వకల్లు
కల్లూరు	14,020	1,710	ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కల్లూరుతో పాటు పట్టణంలో 14పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.
మొత్తం	17,262	1,898	

విద్యార్థినుల రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థినికి ప్రశంసా పత్రం అందిస్తున్న దృశ్యం

కల్లూరు: దూపాడు సమీపంలోని అశోకా మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ టీమ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కర్నూలు ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కె.జి.గోవింద రెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.రామచంద్రరావు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కళాశాలకు చెందిన 135 మంది విద్యార్థినులు రక్తదానం చేయగా వారందరినీ అతిథులు ప్రత్యేకంగా అభినందించి సర్టిఫికెట్ అందించారు. విద్యార్థినులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ నవీన్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

గెలుపోటములను స్ఫూర్తిగా తీసుకోవాలి



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: క్రీడాకారులు గెలుపోటములను స్ఫూర్తిగా తీసుకుని రాణించాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. బుధవారం సాయంత్రం మండలంలోని కాల్వ గ్రామంలో నిర్వహించిన జాతీయస్థాయి కబడ్డీ పోటీలను మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా స్థానిక సయ్యద్ సుల్తాన్ మహ్మద్‌షా ఖాద్రి దర్గాలో స్వాముల వారికి ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళలు, ప్రస్తుతం పురుషుల దీటుగా క్రీడల్లో రాణించడం హర్షణీయమన్నారు. ముఖ్యంగా కబడ్డీ క్రీడలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడం గర్వించదగ్గ విషయమన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన మహిళా క్రీడాకారులకు లోటు లేకుండా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం క్రీడాపోటీలను ఆసక్తిగా తిలకించారు. ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, స్థానిక ఎంపీటీసీ సభ్యులు నాగిరెడ్డి, నిర్వాహకులు ఎర్రెద్దుల సుల్తాన్, లోటర్ బాష, చిన్న వెంకటేశ్వర్లు, జీకె వెంగన్న తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చెన్నసోమేశ్వరుడి ఉత్సవాలు



పోలకల్‌లో చెన్న సోమేశ్వరస్వామివారి వసంతోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో ఈ నెల 1న ప్రారంభమైన శ్రీ చెన్నసోమేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయని ఆలయ ప్రధాన అర్చకులు బీచుపల్లి తెలిపారు. గ్రామంలో స్వయంభుగా వెలసిన స్వామి వారి ఉత్సవాలను 8 రోజులపాటు భక్తులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించి సంతాన ప్రసాదం పంపిణీ చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి భారీ ఎత్తున తరలివచ్చిన భక్తులు వేచి ఉండి సంతాన సాఫల్య ప్రసాదం పొందారు. ప్రధాన అర్చకులు బీచుపల్లి భక్తులకు ప్రసాద స్వీకరణ నియమ, నిష్ఠలను తెలియజేశారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించి ఆలయ ఆవరణలో ఉత్సవమూర్తులపై రంగులు చల్లి వసంతోత్సవం సంబరంగా జరుపుకున్నారు. మధ్యాహ్నం ఉత్సవ కంకణాల వితరణను ఆలయ అర్చకులు చంద్రశేఖర్ శర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం చెన్నసోమేశ్వర, పార్వతి, గంగాదేవి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి గ్రామంలో మేళతాలాలతో ఊరేగించారు. దేవతామూర్తుల విగ్రహాలను గ్రామంలోని అమ్మవారి బావికి తీసుకెళ్లి చక్రస్నానం చేయించారు. ఉత్సవాలు విజయవంతంగా ముగియడంతో భక్తులు, ప్రజలు, పోలీస్ సిబ్బందికి ఆలయ ధర్మకర్త పద్మనాభరెడ్డి, గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

10న జాబ్‌మేళా

గూడూరు రూరల్: నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటున్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 10న మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు ఎంపీఈఆర్ డైరెక్టర్ ఆదిమూలపు సతీష్ పేర్కొన్నారు. మండల పరిధిలోని గుడిపాడులో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10న కర్నూలులోని జొహరాపురం రోడ్డు ఏ క్యాంపు నందు మదర్ థెరిసా ఫార్మసీ ఎడ్యుకేషన్ కాలేజీలో నిరుద్యోగ అభ్యర్థులకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఉన్నత చదువులు చదివిన నిరుద్యోగులను కలుసుకుని జాబ్‌మేళాపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరై ఉపాధి అవకాశాలను పొందాలని ఆయన తెలిపారు.

వైభవంగా గరుడోత్సవం



గరుడ వాహనంపై సతీసమేతంగా దర్శనమిస్తున్న శ్రీవారు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో కొలువైన శ్రీరంగనాథుడి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉద యం ఆలయంలో స్వామివారికి బిందెసేవ, పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామి వారి ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై కొలువుంచారు. అనంతరం పల్లకీలో గ్రామ పుర వీధుల గుండా మేళతాళాలతో జనవాహిని మధ్య ఊరేగించారు. ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ మల్లికార్జున, సిబ్బంది రఘు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

నవధాన్యాల సాగుపై అవగాహన

గూడూరు రూరల్: రైతులు నవధాన్యాల సాగుపై దృష్టి సారించి లాభాలు అర్జించాలని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ మధు సూచించారు. మండల పరిధిలోని గుడిపాడు, పెంచికలపాడులో నవధాన్యాల సాగుపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవధాన్యాల సాగు వల్ల పంట దిగుబడులు పెరుగుతాయన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నవధాన్యాల సాగు చేపడితే తక్కువ ఖర్చుతో లాభసాటిగా ఉంటుందన్నారు. రసాయన మందులు, ఎరువుల వాడకం లేకుండా ప్రకృతి సిద్ధంగా తయారు చేసిన రసాయనాలు పంటకు పిచికారీ చేస్తే మంచి దిగుబడులు వస్తాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మల్లికార్జున, విశ్వనాథ, మహేశ్వరరెడ్డి, చంటి, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సీఎం అండ

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అండగా ఉంటూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర నాయకులు తెర్నేకల్ సురేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సీతరాం నగర్‌లోని ఆయన కార్యాలయంలో మహిళ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులతో కలిసి కేట్ కట్ చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



గూడూరులో మహిళకు బహుమతి అందిస్తున్న మెప్మా సీఎంఓ సూర్యనారాయణ



పాణ్యంలో ప్రశంసా పత్రాలు అందిస్తున్న ఏపీఎం ఎన్.ప్రసాద్

గూడూరు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మెప్మా సీఎంఓ సూర్యనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక నగర పంచాయితీ కార్యాలయంలో మహిళా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. సీఎంఓ మాట్లాడుతూ పురుషులతో పాటు మహిళలకు సమానత్వం ఉండాలన్నారు. ఆర్థిక, సామాజికంగా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేసారు. మహిళలకు మ్యూజికల్ చైర్స్ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మున్సిపల్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్యామల, మెప్మా సీఓ మద్దమ్మ, ఏపీజీబీ, ఎస్‌బీఐ బ్యాంక్ సిబ్బంది, ఆర్పీలు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

పాణ్యం: సమాజాభివృద్ధిలో మహిళలదే కీలకపాత్ర అని ఏపీఎం ఎన్.ప్రసాద్ అన్నారు. బుధవారం పాణ్యంలోని పొదుపు కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గత రెండు రోజులుగా పొదుపు సంఘాల ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారు. ప్రతిభ కనబరిచిన మహిళలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఏపీఎం మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా మహిళలు పొదుపు ఉద్యమాన్ని నడుపుతున్నారు. ఒక్క రూపాయితో మొదలైన ఈ ఉద్యమం నేడు ఎలాంటి షూరిటీ లేకుండా బ్యాంకు లింకేజీ ద్వారా రూ.20 లక్షల వరకు రుణాలు పొందుతున్నారంటే మహిళల కృషి ఎంతో ఉందన్నారు. సంఘాల అభివృద్ధితో పాటు చిన్నతరహా పరిశ్రమలను స్థాపించి అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని వివరించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు సరళమ్మ, సీసీలు రఘురాం, పుల్లన్న, ఏటబీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



పెద్దపాడులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కల్లూరు: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని నగర డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక సూచించారు. బుధవారం మండలంలోని పెద్దపాడు యూనిట్‌లో నవధాన్యాల సాగుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. యుఎన్ఓ ఈ ఏడాదిని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందన్నారు. ప్రకృతి వ్యవసాయంతో నేల సంరక్షణతో పాటు అందరం ఆరోగ్యంగా ఉంటామన్నారు. అనంతరం పెద్దపాడు రైతులు మహేశ్వర్ రెడ్డి పీఎమ్‌డీఎస్ కిట్లు అందించారు. పొలంలో నవధాన్యాలు సాగు చేయడం వల్ల కలిగే ఉపయోగాలను ప్రకృతి వ్యవసాయ అధికారులు వివరించారు. సచివాలయ సిబ్బంది, ఆదర్శ రైతులు, పెద్దపాడు, కె.మార్కపురం ప్రకృతి వ్యవసాయ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

హోలీ.. ఆనందకేళి





కర్నూలు నగరంలోని బిర్లా గేట్ వద్ద ఉన్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం హోలీ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. మేయర్ బీవై రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, మహిళా ప్రజాప్రతినిధులు తదితరులు రంగులు చల్లుకొని సంబరాలు చేసుకున్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



స్వామివార్లను దర్శించుకునేందుకు వస్తున్న భక్తులు

గడివేముల: మండలంలోని ఒండుట్ల గ్రామం సమీపంలో వెలసిన రంగనాయక స్వామి, రంగల్‌దర్వేశి ఖాద్రి ఆలయాలు బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. కులమతాలకు అతీతంగా జరుగుతున్న తిరునాలకు మండలంలోని భక్తులతో పాటు జిల్లాలలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎర్రమల కొండపై కొలువైన స్వయంభూ రంగనాయక స్వామి, కొండ కింద రంగల్ దర్వేశి ఖాద్రి స్వాములను దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

హరిహర సుతుడా.. అయ్యప్పా



మాట్లాడుతున్న రాజు దేశ్ పాండే, పాల్గొన్న వివిధ జిల్లాలకు చెందిన గాయకులు



ప్రత్యేక అలంకారంలో మణికంఠ అయ్యప్పస్వామి

కర్నూలు కల్చరల్: అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రం ఫాల్గుణ మాసం ఉత్తరా నక్షత్రాన్ని పురస్కరించుకొని సప్తగిరినగర్ మణికంఠ అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. కాషాయ ధ్వజారోహణ, గోపూజ, అభిషేకం, స్వామికి ప్రత్యేక అలంకారం, అఖండ జ్యోతి ప్రజ్వలన, మహా పడి పూజ తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. హరిహర సుతుడా.. అయ్యప్పా అంటూ స్వామి నామస్మరణతో ఆలయం మార్మోగింది. అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి ఆధ్వర్యంలో 'నీ గానమే నా ప్రాణం' ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిరంతరాయంగా 12 గంటల పాటు అఖండ భజన నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన గాయకులతో కూడిన భజన బృందాలు అఖండ భజనలో పాల్గొని స్వామి భజన కీర్తనలు ఆలపించి మంత్ర ముగ్ధులను చేశారు. అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి అధ్యక్షులు రాజు దేశ్ పాండే, గాయకులు డప్పుశీను, మార్కాపురం శీను, రామలింగారెడ్డి, రంగనాథాచారి, వెంకటరెడ్డి, లక్ష్మణారెడ్డి, కుమార స్వామి, మల్లి, జంగిరెడ్డి, శ్రీనివాసులు, కర్నూలు భజ మండలి వారు భజనలో పాల్గొన్నారు. వారిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సమితి ప్రచార నిర్వాహకులు హరినారాయణ, రమేష్, ఆలయ కమిటీ జాయింట్ సెక్రటరీ మహేష్, కోశాధికారి రమేష్, జగన్నాథ గుప్త, కే వీ సుబ్బారెడ్డి, దివాకర్‌రెడ్డి, సత్యనారాయణ, నాగన్న, మధుసూదన్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల అమలులో ఆదర్శంగా నిలవాలి



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం

కర్నూలు: ట్రాఫిక్ నిబంధనల అమలులో విద్యార్థులు అందరికీ ఆదర్శంగా నిలవాలని ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం అన్నారు. కల్లూరు మండలం దూపాడు దగ్గర ఉన్న కేవీ సుబ్బారెడ్డి ఫార్మా కాలేజీలో బుధవారం విద్యార్థినులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ట్రాఫిక్ నిబంధనలపై ప్రాజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. లైసెన్స్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడిన వీడియో చిత్రాలను ప్రాజెక్టర్‌లో ప్రదర్శించారు. లైసెన్స్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపి ప్రమాదాలు చేస్తే విద్యార్థులు పోలీసు కేసుల్లో ఇరుక్కుంటారని తెలిపారు. అలా కేసుల్లో ఇరుక్కున్న వారికి ప్రభుత్వ ఉద్యోగాలు కూడా రావన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అతివేగంతో వాహనాలు నడపటం ప్రమాదకరమని హెచ్చరించారు. అలాగే వాహనాలు పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే నిలుపుకోవాలని, లైసెన్స్ లేని మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని,..వారు ప్రమాదాలకు కారకులైతే వారి తల్లిదండ్రులు కూడా ముద్దాయిలవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల బోధన, బోధనేతర సిబ్బందితో పాటు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ విజేత కేవీ సుబ్బారెడ్డి జట్టు

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలోని ఏ.క్యాంపులో ఉన్న మైపర్ ఫార్మసీ కళాశాల క్రీడా మైదానంలో బుధవారం అంతర్ ఫార్మసీ కళాశాలల క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్‌లో మైపర్ ఫార్మసీ కళాశాల జట్టుపై కేవీ సుబ్బారెడ్డి కళాశాల జట్టు గెలుపొందింది. విన్నర్స్, రన్నర్స్‌కు మైపర్ ఫార్మసీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. తద్వారా ఒత్తిడిని అధిగమించి మరింత చురుగ్గా ఉంటారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్ పాల్గొన్నారు.